సాక్షి
సూర్యాపేట
సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



గంజాయి ముఠా అరెస్ట్

గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2.4కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. - 8లో



ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

నల్లగొండలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా సాగింది. - 10లో



యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. - 10లో

న్యూస్‌రీల్

13 మంది ఎంపీడీఓల బదిలీ

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో వివిధ మండలాల్లో పనిచేస్తున్న 13 మంది ఎంపీడీఓలను బదిలీ చేస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్ అండ్ రెవెన్యూ శాఖ కమిషనర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నాలుగేళ్లకు పైబడి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న వారితో పాటు సొంత జిల్లాలకు చెందిన వారిని వారి జిల్లాలకు బదిలీ చేశారు. బదిలీ అయిన వారిలో ఎంపీడీఓలు సరోజ, యర్రయ్య, హుస్సేన్, శ్రీనివాసరావు, శంకరయ్య, ఉమేష్‌చారి, ఇందిరా, మల్సూర్, జానయ్య, యాదయ్య, లక్ష్మి, వెంకటేశ్వర్లు, వెంకటాచారి ఉన్నారు.

మంత్రి ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక



మంత్రి ఉత్తమ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీ హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్షుడు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్ గుండా ఫణికుమారి, గుండా రామిరెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ వారికి కాంగ్రెస్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మంత్రిని శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లిఖార్జున్‌రావు ఉన్నారు. ఇదిలా ఉండగా బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి కొన్ని అనివార్య కారాణాల వల్ల తన పదవికి రాజీనామా చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో చెకుముకి పోటీల నిర్వాహకులు

సూర్యాపేట టౌన్: రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో సూర్యాపేట జిల్లా విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నట్టు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గోళ్లమూడి రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులుగా జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల్లో తుంగతుర్తి బాలుర రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల ఇంగ్లిష్ మీడియం విభాగంలో ద్వితీయ స్థానాన్ని, అంజలి స్కూల్ విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విభాగంలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను రమేష్‌బాబుతో పాటు షేక్ జాఫర్, నారాయణరెడ్డిలు అభినందించారు.

వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట): వడ్డెరుల బతుకులు మారాలంటే వడ్డెర కులాన్ని బీసీ నుంచి తొలగించి ఎస్టీ జాబితాలో చేర్చాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర వెంకన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దండుగుల సైదులు కోరారు. ఆదివారం సూర్యాపేటలోని వడ్డెర సంఘం భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. చదువుకునే వడ్డెర విద్యార్థులకు గురుకుల పాఠశాలలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలన్నారు. వడ్డెర కార్మికులు వృత్తిలో ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. సమావేశంలో వడ్డెర బాలకష్ణ, అంజయ్య, కొడిదల రాంబాబు, కళింగం, శివరాత్రి విజయ్, శివరాత్రి రవి, గోగుల లింగయ్య, శివరాత్రి మహేష్, వరికుప్పల నవీన్, ఆలకుంట్ల ఉపేందర్, వన్ రూపి ఆర్మీ రాజు పాల్గొన్నారు.

తప్పుల సవరణ..

- 'మహాలక్ష్మి' దరఖాస్తుల్లో పొరపాట్లను సరిచేస్తున్న అధికారులు
- ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ
- రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇచ్చేందుకు కసరత్తు



తుంగతుర్తిలో మహాలక్ష్మి పథకం దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

నాగారం: ఆరు గ్యారంటీ పథకాల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించింది. మరో రెండు హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింపజేసేందుకు ఈ నెలలో తీసుకునే బిల్లులోనే అర్హుల వివరాలను నమోదు చేసేలా కార్యాచరణ మొదలు పెట్టింది. అలాగే ప్రస్తుతం ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం కింద స్వీకరించిన దరఖాస్తుల్లో దొర్లిన తప్పుల సవరణకు పూనుకుంది. ఇందులో భాగంగా జిల్లాలోని పంచాయతీలు, పురపాలక సంఘాల్లో ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల వివరాల సేకరణకు సర్వే ప్రారంభించాయి.

జిల్లాలో గ్యాస్ కనెక్షన్‌దారులు	మహాలక్ష్మి పథకానికి వచ్చిన అర్జీలు
4,05,899	3,26,383

సేకరించిన వివరాల నమోదుకు కొత్త యాప్

మహాలక్ష్మి పథకం దరఖాస్తుల్లో వచ్చిన తప్పులను సవరించేందుకు జిల్లాలో అధికారులు ఇంటింటి సర్వేను చేపట్టారు. ఒక్కో గ్రామంలో సుమారు 50 నుంచి 60శాతం మంది తప్పుగానే రాశారు. ఈ తప్పులను సవరించి, తిరిగి నమోదు చేసేందుకు ప్రభుత్వం కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి గ్యాస్ వినియోగదారుల పేరు, గ్యాస్ కనెక్షన్ నంబర్, సంబంధిత కంపెనీ, ఆధార్, ఆహార భద్రతా కార్డుల నంబర్ల వివరాలతో ప్రత్యేక యాప్‌ను రూపొందించి కార్యదర్శులకు అందించింది. దీంతో అధికారులు నంబరు తప్పుగా నమోదైన వారి ఇంటికి వెళ్లి సరైన నంబర్‌ను పరిశీలించి నమోదు చేస్తున్నారు. జిల్లాలోని 475 పంచాయతీలతో పాటు, ఐదు పురపాలక సంఘాల్లో కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలతో కూడిన బృందాలు దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సవరిస్తున్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు.

3.75లక్షల మంది..

జిల్లాలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో అభయహస్తం గ్యారంటీ పథకాలకు 3,75,094 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అత్యధికంగా రూ.500 సిలిండర్ కోసం 3,26,383 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో తప్పుగా నమోదు చేసుకున్న వారి వివరాలను ప్రస్తుతం సేకరించి తిరిగి కొత్త యాప్‌లో నమోదు చేస్తున్నారు. గ్యాస్ కంపెనీల లెక్కల ప్రకారం జిల్లాలో 4,05,899 మందికి గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో రేషన్‌కార్డు ఉన్నవారే అర్హులు. ఈ లెక్కన దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఈ పథకం వర్తించదు. అధికారుల సర్వే తర్వాత అర్హుల సంఖ్య తేలనుంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకే..



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలనలో మహాలక్ష్మి పథకానికి చేసుకున్న దరఖాస్తుల్లో తప్పులను సవరిచేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నాం. దరఖాస్తుదారుల గ్యాస్ కన్స్యూమర్, ఆధార్ వివరాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. దరఖాస్తుదారులంతా ఆధార్, ఆహార భద్రత కార్డులు, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ పాసుపుస్తం అందుబాటులో ఉంచుకోవాలి.

– సాంబిరెడ్డి, నాగారం మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీఓ, సూర్యాపేట

నేడు నేరేడుచర్ల మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక

- ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు



సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

నేరేడుచర్ల: నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు రంగం సిద్ధమైంది. సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గతనెల 23న అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చందమళ్ల జయబాబు చైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు. ఇప్పటికే వైస్ చైర్‌పర్సన్ చల్లా శ్రీలతారెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది.

గతంలో ఎక్స్ అఫీషియో సభ్యుల బలంతో బీఆర్‌ఎస్‌కు పదవులు

నేరేడుచర్ల మున్సిపాలిటీలో మొత్తం 15 మంది కౌన్సిలర్లు ఉండగా చైర్మన్ పీఠం ఎస్సీ రిజర్వేషన్ చేశారు. 2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి 7, కాంగ్రెస్ పార్టీకి 7, సీపీఎంకు ఒకటి చొప్పున కౌన్సిలర్లు గెలుపొందారు. కాగా, సీపీఎం కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చారు. అప్పటి ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రర్ రావు ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా కాంగ్రెస్ పార్టీ నుంచి నమోదు చేసుకోవడంతో కాంగ్రెస్ పార్టీకి బలం 10కి పెరిగింది. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి అప్పటి ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీలు బోడకుంట వెంకటేశ్వర్లు, శేరి సుభాష్‌రెడ్డి ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా బీఆర్‌ఎస్ నుంచి నమోదు చేసుకోవడంతో బీఆర్‌ఎస్ బలం 11 చేరింది. దీంతో బీఆర్‌ఎస్‌కు చెందిన చందమళ్ల జయబాబు చైర్మన్‌గా, చల్లా శ్రీలతారెడ్డి వైస్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం నిర్వహించే ప్రత్యేక సమావేశానికి అన్ని ఏర్పాట్లు చేశాం. సోమవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే ఎన్నికకు ఎన్నికల అధికారిగా హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి వ్యవహరించనున్నారు.

– వెంకటేశ్వర్లు, కమిషనర్, నేరేడుచర్ల

కౌన్సిలర్ల మద్దతు కాంగ్రెస్ పార్టీకే..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రాజకీయ పరిస్థితులు మారిపో యాయి. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సుంకు సులోచన, అలక సరిత సైదిరెడ్డి, ఎస్‌కే.బాష కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్యా బలం 10కి చేరింది. దీంతో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించగా మిగిలిన బీఆర్‌ఎస్, సీపీఎం కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. దీంతో గతనెల జనవరి 23న జరిగిన అవిశ్వాస తీర్మానంలో చందమళ్ల జయబాబుపై అవిశ్వాసం నెగ్గడంతో చైర్మన్ పదవి నుంచి తొలగించారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నుంచి చైర్మన్ అభ్యర్థిగా బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్మన్‌గా అలక సరితను ప్రకటించారు. అయితే ప్రస్తుతం చైర్మన్ మినహా బీఆర్‌ఎస్, సీపీఎం కౌన్సిలర్లు కాంగ్రెస్‌కే మద్దతు తెలపడంతో చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం కానున్నట్టు తెలుస్తోంది.

రేపు డ్రామా పోటీలు

సూర్యాపేట టౌన్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ సూర్యాపేట ఆధ్వర్యంలో ఈ నెల 13న జిల్లా కేంద్రంలోని ఎంఏఎం పాఠశాలలో జిల్లా స్థాయి స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సుధీర్‌రెడ్డి, పబ్బతి వెంకటేశ్వర్లు తెలిపారు. పోటీలు పాఠశాల, మండల స్థాయిల్లో నిర్వహించినున్నట్టు పేర్కొన్నారు.

● చాంపియన్ నల్లగొండ జట్టు



భువనగిరిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో చాంపియన్ షిప్ పోటీల్లో విజయం సాధించిన నల్లగొండ జిల్లా మహిళా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

క్రీడల్లో రాణించి జిల్లాకు పేరుతేవాలి

హుజూర్‌నగర్: క్రీడల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తేవడంతోపాటు విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఐఆర్‌ఎస్ అధికారి సందీప్‌బాగా, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు బెల్లంకొండ రామచందర్‌గౌడ్ అన్నారు. చింతలపాలెం మండలం మల్లారెడ్డిగూడెంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగే 33వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలుర, బాలికల జట్లను ఆదివారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో 150 మంది బాలురు 70 మంది బాలికలు పాల్గొనగా వీరిలో బాలుర జట్టుకు 20 మంది, బాలికల జట్టుకు 20 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి పట్టణంలో నాలుగు రోజుల శిక్షణ అనంతరం ప్రధాన జట్టును ప్రకటించనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి నామ నరసింహారావు, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు రవీందర్‌రెడ్డి, కె.వెంకటరెడ్డి, నాయకులు గెల్లిరవి, దొంతగాని శ్రీనివాస్, కోటి సంపత్‌రెడ్డి, సంపత్‌వర్మ, ముడెం గోపిరెడ్డి, కస్తాల శ్రవణ్, శంబయ్య, వి.మస్తాన్, మురళి, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, నాయకులు

ఆంగ్లభాషా నైపుణ్యం పెంచేలా..

- ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు ఇంగ్లిష్‌పై ప్రయోగ పరీక్షలు
- ఈ ఏడాది నుంచే అమలు చేస్తున్న ప్రభుత్వం
- నాలుగు విడతల్లో పరీక్షలకు కార్యాచరణ



హుజూర్‌నగర్ : ప్రయోగ పరీక్షల్లో విద్యార్థులను పరిశీలిస్తున్న అధ్యాపకుడు (ఫైల్)

హుజూర్‌నగర్: ఇంటర్మీడియట్ స్థాయిలోనే విద్యార్థుల్లో ఆంగ్లభాషా నైపుణ్యం పెంచి ఆంగ్ల భాషపై మరింత పట్టు సాధించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు ఈ ఏడాది నుంచి ఆంగ్లంలో ప్రయోగ పరీక్షల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఇంటర్ మొదటి సంవత్సరం చదివిన విద్యార్థులు అందరూ తప్పకుండా ఈ పరీక్షకు హాజరు కావాల్సిం టుంది. మొత్తంగా 80 మార్కులు థియరీకి, ప్రయోగ పరీక్షకు 20 మార్కులు కేటాయించారు. నాలుగు దశల్లో నిర్వహించే ప్రయోగ పరీక్షల్లో 20 మార్కులకు గాను కనీసం 7 మార్కులు వస్తేనే వారు ఉత్తీర్ణులు అవుతారు. గైర్హాజరైన విద్యార్థులను ఫెయిల్ అయినట్టుగా పరిగణిస్తారు.

వివరాలు ఇలా..

అన్నిరకాల జూనియర్ కళాశాలలు	77
ఫస్టియర్ విద్యార్థులు	6,500

నాలుగు దశల్లో నిర్వహణ

విద్యార్థులకు ఆంగ్ల భాషపై ఉన్న సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు ఈ విద్యా సంవత్సరం నుంచే నాలుగు దశల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాటిలో మొదటిది కమ్యూనికేటివ్ ఫంక్షన్స్ దీనిలో ఏదైనా ఒక అంశంపై ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులు సంభాషించుకునే తీరును అధ్యాపకులు పరీక్షిస్తారు. రెండోది జస్ట్ ఎ మినిట్ (జామ్) పేరిట ఒక అంశంపై విద్యార్థులు నిమిషం లోపు అనర్గళంగా మాట్లాడాల్సి ఉంటుంది. మూడోది రోల్‌ప్లే దీనిలో తల్లిదండ్రులు లేదా మరేదైనా అంశంపై విద్యార్థులు బృందంగా చర్చించాలి. ఇక చివరిదైన నాలుగో పరీక్షలో లిజనింగ్ కాంప్రహెన్షన్ పేరిట గ్రహించే శక్తి పెంపొందించడంపై విద్యార్థులను అధ్యాపకులు పరీక్షిస్తారు.

16న చివరి ప్రయోగ పరీక్ష

ప్రస్తుత విద్యా సంవత్సరంలో మూడు విడతల్లో ప్రయోగ పరీక్షలు జరిగాయి. చివరి పరీక్ష ఈనెల 16న నిర్వహించనున్నారు. దీని కోసం అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన మూడు దశల ప్రయోగ పరీక్షలకు హాజరుకాని వారు కూడా నాలుగో విడతలో పరీక్షకు హాజరయ్యేందుకు అవకాశం కల్పించారు.

19న పర్యావరణ విద్య టెస్టు

ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులను పర్యావరణ విద్య పరీక్షకు సన్నద్ధం చేయిస్తున్నారు. కొత్తగా ఆంగ్లంలో ప్రయోగ పరీక్ష ఉండడంతో రెగ్యులర్ విద్యార్థులకు నైతికత–మానవ విలువలు అనే అంశంపై పరీక్ష నిర్వహించడం లేదు. గతంలో ఫెయిలైన వారికి మాత్రమే ఈ నెల 17న పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 19న నిర్వహించే పర్యావరణ విద్య పరీక్షను రెగ్యులర్ విద్యార్థులంతా రాయాల్సి ఉంటుంది.

విద్యార్థుల ఉత్తీర్ణతకు కొలమానం



విద్యార్థులు ఆంగ్ల భాషపై మరింత పట్టు సాధించేందుకు ఈ ఏడాది ఆంగ్ల సబ్జెక్టుపై ప్రయోగ పరీక్ష నిర్వహిస్తున్నాం. విద్యార్థుల ఉత్తీర్ణతకు ఇది కొలమానం కానుంది. విద్యార్థులు నిర్లక్ష్యం చేయకుండా తప్పకుండా ప్రయోగ పరీక్షకు హాజరు కావాలి.

– జానపాటి కృష్ణయ్య, డీఐఈఓ, సూర్యాపేట

వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలి

- ప్రిన్సిపాల్, ఆర్‌సీఓను సస్పెండ్ చేయాలి
- వివిధ సంఘాల నాయకుల డిమాండ్
- ఇమాంపేట గురుకులం వద్ద వైష్ణవి తల్లిదండ్రుల ఆందోళన
- మద్దతుగా పాల్గొన్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు



గురుకులం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థిని తల్లిదండ్రులు, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

సూర్యాపేట రూరల్: సూర్యాపేట మండలం ఇమాంపేట గురుకుల పాఠశాలలో చదువుతూ మృతిచెందిన జిల్లా కేంద్రానికి చెందిన దగ్గుపాటి వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలని వివిధ పార్టీలు, పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వేధింపుల వల్లే వైష్ణవి మృతిచెందిందని ఆరోపించారు. కుమార్తె మృతికి కారణమైన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఆర్‌సీఓలను వెంటనే సస్పెండ్ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇమాంపేట గురుకుల పాఠశాల ఎదుట వైష్ణవి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. వీరి ఆందోళనకు బీఎస్పీ రాష్ట్రఅధ్యక్షుడు ఆర్ఎస్. ప్రవీణ్‌కుమా ర్, ఆ పార్టీ నాయకులు, వివిధ పార్టీలు, సంఘాల నేతలు, ఎన్టీఆర్ కాలనీ వాసులు మద్దతుగా హాజరయ్యారు. దీంతో పాఠశాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మూడు గంటల పాటు సాగిన ఆందోళనను చివరకు అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఎస్పీ నాగభూషణం హామీలో విరమించారు.

మా కుమార్తెను పొట్టనబెట్టుకున్నారు..

అల్లారుముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కుమార్తెను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఆర్‌సీఓ వేధించి పొట్టనపెట్టుకున్నారని విద్యార్థిని దగ్గుపాటి వైష్ణవి తల్లిదండ్రులు వెంకన్న, భాగ్యమ్మ ఆరోపించారు. తన బిడ్డ జీవితాన్ని ప్రిన్సిపాల్ నాశనం చేసిందని రోదించారు. తన బిడ్డకు జరిగిన అన్యాయం మరొకరికి జరగవద్దన్నారు. హాస్టల్‌లో భోజనం, కూరలు రుచిగా లేవని చెప్పడంలో తప్పు ఏముందన్నారు. ఉన్నతాధికారులకు మెనూ సక్రమంగా అమలు చేయడంలేదని చెప్పిన పాపానికి ప్రిన్సిపాల్ వేధింపులకు గురిచేయడమేంటని కన్నీరుమున్నీరయ్యారు.



సూర్యాపేట ఆస్పత్రిలో వైష్ణవి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ప్రభుత్వమే బాధ్యత వహించాలి : మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గురుకులాల్లో చదువుతున్న విద్యార్థినుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థినులకు పౌష్టికాహారం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలను నిలువరించాలని కోరారు. అనంతరం ఆమె వైష్ణవి మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కఠినంగా శిక్షించాలి

భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థినుల ఆత్మహత్యపై ప్రభుత్వం విచారణకు ఆదేశించి రోజులు గడవక ముందే ఇమాంపేట సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకులంలో మరో ఇంటర్ విద్యార్థిని దగ్గుపాటి వైష్ణవి మృతి చెందటం బాధాకరమని ప్రముఖ న్యాయవాది, మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తల్లమళ్ల హస్సేన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల మరణాలపై తక్షణమే విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వైష్ణవి ఆత్మహత్యపై విచారణ జరపాలి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న అనంతుల మధు

భానుపురి (సూర్యాపేట): ఇమాంపేటలోని సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దగ్గుబాటి వైష్ణవి ఆత్మహత్య ఘటనపై పూర్తిస్థాయిలో ప్రభుత్వం విచారణ జరపాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు, రాష్ట్ర నాయకుడు పంతం యాకయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మార్చురీలో వైష్ణవి మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైష్ణవి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ రహమత్ పాషా, భాషపంగు సునీల్, కొలికపంగు వాసు, వెంకటేష్ నాయక్, సందీప్, సంపతు, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

సూర్యాపేట: మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ..విద్యార్థిని వైష్ణవి ఇంటికి వెళ్లి ఆమె మృతదేహంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించినవారిలో మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణ, జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటనారాయణ గౌడ్ , శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.



వైష్ణవి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

క్లుప్తంగా

గాయపడిన వ్యక్తి మృతి

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లక్కారం గ్రామానికి చెందిన షేక్ అమీర్(40) ఈనెల 9న ద్విచక్ర వాహనంపై చౌటుప్పల్‌కు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఆ క్రమంలో లక్కారం గ్రామానికి వెళ్లే దారిలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతన్ని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మిర్యాలగూడ పట్టణం బంగారుగడ్డలో నివాసముంటున్న గడ్డం లింగయ్య యాదమ్మ దంపతులకు నలుగురు కుమారులు. వీరిలో చిన్నవాడైన గడ్డం మహేష్(24) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేష్ ఆర్థిక ఇబ్బందులతోనే అఘాయిత్యానికి పాల్పడ్డాడని తెలిసింది. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని టూ టౌన్ పోలీసులు తెలిపారు.

లారీ, బైక్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

వలిగొండ : లారీ, బైక్ ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన వలిగొండ మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామానికి చెందిన శివకుమార్ వలిగొండ మండలం ఎదుళ్ల గూడెంలోని బంధువుల ఇంటికి బైక్‌పై వచ్చాడు. తిరిగి వెళ్తున్న క్రమంలో మండలంలోని నాతాళ్లగూడెం సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన శివకుమార్‌ను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

చాక్లెట్ ఆశ చూపి.. బాలికను బెదిరించి..

- భయంతో పరుగులు తీసిన మైనర్
- స్థానికులు అప్రమత్తం కావడంతో పారిపోయిన దుండగుడు

నేరేడుచర్ల : పదేళ్ల చిన్నారికి చాక్లెట్ ఇస్తానని ఓ దుండగుడు ఆశ చూపి బెదిరించాడు. నేరేడుచర్ల మున్సిపాలిటీలోని చింతబండ వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చింతబండ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న చిన్నారి సాయంత్రం నడుచుకుంటూ ఇంటికి వెళ్తోంది. ఆ సమయంలోనే ఓ దుండగుడు ద్విచక్రవాహనంపై వచ్చి ఆ చిన్నారికి చాక్లెట్ ఇస్తానంటూ అనడంతో తీసుకోకుండా వెళ్లిపోతుంది. చాక్లెట్ ఎందుకు తీసుకోవని బెదిరించినట్లు మాట్లాడటంతో ఆ చిన్నారి భయంతో పరుగులు పెట్టి పక్కనే ఉన్న ఓ ఇంటిలో తలదాచుకుంది. అక్కడ ఉన్నవారికి విషయం చెప్పడంతో బయటకు వచ్చే సరికి దుండగుడు పారిపోయాడు. గ్రామాల్లో అపరిచిత, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులు, 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ పచ్చిపాల పరమేష్ కోరారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

- ఐదుగురు నిందితుల నుంచి 2.4కిలోల గంజాయి, బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం
- పరారీలో మరొకరు
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం : గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2.4కిలోలల గంజాయితో పాటు బైక్, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే నిందితుల వివరాలు వెల్లడించారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా టేకులపల్లి గ్రామానికి చెందిన బోడ సురేశ్, బానోతు మోహన్, భూక్య అఖిల్, తిరుమలాయపాలెం మండలం బచ్చోడుతండాకు చెందిన ధరావత్‌వినోద్, కూసుమంచి మండలం మంగలితండాకు చెందిన నూనావత్ సాయి, సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన గణపారపు శ్రీకాంత్‌లు స్నేహితులు. వీరు ఓ ముఠాగా ఏర్పడి సులువుగా డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. రెండేళ్లుగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల నుంచి రూ.4,500లకు కిలో చొప్పున గంజాయిని కొనుగోలు చేసుకుని వచ్చి సూర్యాపేట జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.

గంజాయి రవాణా చేస్తూ..

ముఠాలోని బోడ సురేశ్, భూక్య అఖిల్ కుమార్, బానోతు మోహన్, వినోద్‌లు ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకువచ్చిన 2.4కిలోల గంజాయిని సూర్యాపేట జిల్లాలోని చిలుకూరు మండలం గనపారపు శ్రీకాంత్‌కు అప్పగించాలని నిర్ణయించుకున్నారు. వీరిలో బోడ సురేశ్, భూక్య అఖిల్‌లు బైక్ మీద, బానోతు మోహన్, ధరావత్ వినోద్‌లు గత శనివారం బస్సులో ఇదే జిల్లా మునగాల మండలంలోని బరాకత్ గూడెం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో చిలుకూరు మండలం బేతవోలు గ్రామ శివారులో మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్ సమీపములోని సాయిలి నవీన్ మామిడి తోటలోకి వెళ్లారు. అదే సమయములో బేతవోలు గ్రామానికి చెందిన గనపరపు శ్రీకాంత్ అక్కడికి వచ్చాడు. అతడికి ముఠా సభ్యులు గంజాయి ప్యాకెట్లు ఇస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారని ఎస్పీ వివరించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.37 వేలు ఉంటుందని తెలిపారు. ఈ ముఠాలో మరో నిందితుడు నునావత్ సాయి పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. సమావేశంలో ఏఎస్పీ మేకా నాగేశ్వరరావు, కోదాడ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది వెంకటేశ్వర్లు, నరేశ్, నాగేశ్, అలీముద్దీన్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి ఎదుట ఆందోళన

- వైద్యుల నిర్లక్ష్యంతోనే రోగి మృతి చెందిందని బంధువుల ఆరోపణ


ఏరియా ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రోగి బంధువులు

మిర్యాలగూడ అర్బన్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే రోగి మృతిచెందిందని ఆరోపిస్తూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మిర్యాలగూడలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనపై మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కన్నెబోయిన సోమమ్మ(63)కు ఉదయం విరేచనాలు కావడంతో 8గంటలకు ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెను పరిక్షించిన ఆస్పత్రి వైద్యులు గ్లూకోజ్ పెట్టి ఇంజక్షన్లు వేశారు. ఆ వెంటనే గుండెలో మంట అంటూ సోమమ్మ అరవడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు ఆస్పత్రి సిబ్బందికి సమాచారం అందించారు. కొద్ది సేపటికే సోమమ్మ మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. వైద్యుల నిర్లక్ష్యం కాణంగానే ఇంజక్షన్ వికటించి మృతిచెందిందని కుటుబ సభ్యులు ఆరోపించారు. బంధువులతో కలిసి ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. రోగి బంధువులతో మాట్లాడి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ విషయమై వైద్యులను వివరణ కోరగా విరేచనాలు కావడంతో బీపీ పూర్తిగా పడిపోయిందని, ఆమెకు దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నాయని, దీనికి తోడు పెద్ద వయస్సు కావడంతో గుండె పోటుకూడా రావచ్చని, తమ నిర్లక్ష్యం ఏమీ లేదని పేర్కొన్నారు.

చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విజయ

మిర్యాలగూడ అర్బన్: పసుపు కుంకుమ కింద ఇచ్చిన ఇంటిని తండ్రి అమ్ముకుంటున్నాడని ఆరోపిస్తూ ఓ యువతి చేయికోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడేనికి చెందిన కదారి రామనర్సయ్యకు ఇద్దరు భార్యలు. గ్రామంలో ఉన్న ఇంటిని తన మొదటి భార్య కుమార్తె విజయకు పసుపు కుంకుమ కింద ఇచ్చి వివాహం చేశారు. ఈ క్రమంలో రామనర్సయ్య ఆ ఇంటిని అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా విజయ అడ్డుకుంటుంది. పసుపు కుంకుమ కింద ఇచ్చిన ఇంటిని ఎలా అమ్ముకుంటావని పెద్ద మనుషులకు సైతం ఫిర్యాదు చేసింది. అక్కడ న్యాయం జరగకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని విజయ పేర్కొంది. గత నెల 28న ఇంటిని అమ్ముకోనియ్యడం లేదని విజయపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల వారిని ఆదివారం స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు మాట్లాడుకోవాలని సూచించారు. దీంతో ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న వ్యవసాయ మార్కెట్ షెడ్డులో మాట్లాడుతున్న సమయంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగిపోయింది. అసలు నాకు పుట్టనేలేదు అని రామనర్సయ్య అనడంతో మనస్తాపం చెందిన విజయ బ్లేడ్‌తో తన చేయిని బలంగా కోసుకుంది. దీంతో చేతి నరాలు తెగిపోయి తీవ్ర రక్తస్రావం అవుతుండగా పోలీస్‌స్టేషన్‌లోకి పరిగెత్తుకుంటూ వచ్చింది. గమనించిన పోలీసులు ఆమెను తొలుత ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు అదృశ్యం

నార్కట్‌పల్లి : వృద్ధుడు అదృశ్యమయ్యాడు. నార్కట్‌పల్లి మండలంలో ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లాకు చెందిన దండు సత్తయ్య కొంత కాలం నుంచి మతిస్థిమితం కోల్పోయాడు. కుటుంబ సభ్యులు అతడిని నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో నిద్రచేయించేందుకు గత శుక్రవారం తీసుకువచ్చారు. శనివారం ఉదయం లేచి చూసే సరికి సత్తయ్య కనిపించలేదు. కుటుంబ సభ్యులు సాయంత్రం వరకు వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆయన కుమారుడు దండు శ్రీనివాస్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

వారంలో పెళ్లి.. అంతలోనే మృత్యు ఒడికి

- బైక్ అదుపుతప్పి యువకుడు మృతి
- పత్రికలు పంచి వస్తుండగా దుర్ఘటన


శివకుమార్ (ఫైల్)

నార్కట్‌పల్లి/మోత్కూరు : వారం రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. తన వివాహ పత్రికలు బంధువులకు పంచి వస్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. నల్లగొండ జిల్లాలో శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రానికి చెందిన సకినాల వెంకటయ్యకు ఇద్దరు కుమారులు.అందులో రెండో కుమారుడైన శివకుమార్(26) వివాహం ఈ నెల 18వ తేదీన జరగాల్సి ఉంది. తన వివాహ వేడుకకు బంధువులు, స్నేహితులను ఆహ్వానించేందుకు శివకుమార్ శనివారం ఉదయం పత్రికలు తీసుకుని బంధువు అప్పిశెట్టి నితిన్‌కుమార్‌తో కలిసి బైక్‌పై నల్లగొండ జిల్లాలోని ఆయా గ్రామాల్లో పర్యటించాడు. పత్రికలు పంపిణీ చేసిన తర్వాత రాత్రి 11గంటల సమయంలో మోత్కూరుకు బయలుదేరారు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు సమీపంలో వీరి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోవడంతో శివకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే 108 వాహనంలో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. నితిన్‌కుమార్‌కు ఏలాంటి గాయాలు కాలేదు. మృతుడి సోదరుడు సంకినాల సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

టీ లైఫ్ బీమా పేరిట టోకరా

హుజూర్‌నగర్ : బీమా పేరిట కొందరు వ్యక్తులు పలువురికి టోకరా ఇచ్చారు. హుజూర్‌గనగర్‌లో ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై బాధితులు సూరేపల్లి సత్యనారాయణ, మేళ్లచెరువు జ్యోతి, దేవపంగు రమాదేవి, డి సంపత్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరిడేపల్లి మండలానికి చెందిన కందుల వినయ్, పుల్లెంల అనిల్ టీలైఫ్‌తో ఆరోగ్యం బాగాలేని వారు, రెండు, మూడు నెలల్లో చనిపోయే దశలో ఉన్నవారు రూ.లక్ష చెల్లించి బీమా చేయించుకుంటే మరణించిన తర్వాత ఐదారు నెలల్లో రూ.6లక్షలు వస్తాయని నమ్మ బలికారు. దీంతో నియోజవర్గంలోని పదుల సంఖ్యలో బాధితులు బీమా చేయించుకున్నారు. గడువు ముగిసినా బీమా రాకపోవడంతో ఇటీవల అనిల్, వినయ్‌లను బాధితులు నిలదీశారు. దీంతో వారికి ప్రామిసరి నోట్‌లు, చెక్కులు రాసిచ్చారు. ఏళ్లు గడుస్తున్నా కట్టిన డబ్బులు రావడం లేదు. హుజూర్‌నగర్ పరిధిలోని మాధవరాయిని గూడెం వద్ద ఒక ఇంట్లో నివాసం ఉంటున్న వినయ్ తన ఇంటిని పదో తారీఖు రాత్రి ఖాళీచేసి పోయేందుకు ప్రయత్నించగా బాధితులు కొందరు పసిగట్టి వ్యాన్‌ను, డ్రైవర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై బాధితులు ఫిర్యాదు ఇచ్చారని విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.


హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న బాధితులు

కోదాడ నుంచి కవి యాత్ర ప్రారంభం


నడిగూడెం : కవులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కోదాడఅర్బన్ : కోదాడకు చెందిన సిలివేరు సాహితీ కళా పీఠం, కోదాడ రచయితల సంఘం, డాక్రి సంస్థ ఆధ్వర్యంలో కోదాడ నుంచి నడిగూడెంలోని రాజావారి కోట వరకు నిర్వహించే కవియాత్రను ఆదివారం పట్టణానికి చెందిన రిటైర్డ్ అధ్యాపకుడు మంత్రిప్రగడ భరతరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ పాల్గొనగా నిర్మల్ కవియాత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కారం శంకర్ ప్రారంభించారు. ఈ యాత్రలో ఆదిలాబాద్, నిజామాబాద్, బైంసా, నిర్మల్, అమలాపురం, రాజమండ్రి, విజయవాడ, చిత్తూరు, అనంతపురం జిల్లాల కవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా ఈ యాత్ర నడిగూడెం రాజావారి కోటలో ముగింపు నిర్వహించారు. కార్యక్రమంలో యాత్ర వ్యాఖ్యాత బి.వెంకట్, సిలివేరు సాహితీ పీఠం అధ్యక్షుడు లింగమూర్తి, కోదాడ మండల రచయితల సంఘం అధ్యక్షుడు పుష్పాల కృష్ణమూర్తి, కోశాధికారి ఎస్ఎస్‌రావు పాల్గొన్నారు.

కవులకు ఘన సన్మానం

నడిగూడెం : మండల కేంద్రంలోని రాజావారికోట డాక్రి సంస్థ కార్యాలయంలో ఆదివారం కవి యాత్ర కార్యక్రమంలో భాగంగా 60మంది ప్రముఖ రచయితలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిలివేరు సాహితి కళాపీఠం అధ్యక్షుడు లింగమూర్తి మాట్లాడుతూ.. ఒకే వేదికపై 60మంది రచయితలను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రచయితలు పొట్లూరి హరికృష్ణ, వెంకటస్వామినాయుడు, కారం శంకర్, కోదాడ రచయితల సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి, కోశాధికారి ఎస్ఎస్‌రావు, కవియాత్ర వ్యాఖ్యాత వెంకట్, పురుషోత్తం, ప్రకాష్, నర్సింహారావు పాల్గొన్నారు.

కరాటేలో కోదాడ విద్యార్థులకు గోల్డ్‌మెడల్



విజేతలుగా నిలిచిన కోదాడ విద్యార్థులు

కోదాడఅర్బన్ : వరంగల్ జిల్లా నర్సంపేటలో ఇటీవల షాటోఖాన్ జపాన్ కరాటే ఇండియా వారు నిర్వహించిన నేషనల్ ఇన్విటేషన్ చాంపియన్ షిప్ 2024 పోటీల్లో కోదాడకు చెందిన కోఫోఖాన్ కరాటే స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు కరాటే ఇన్‌స్ట్రక్టర్ ఆరే మాధవిలత ఆదివారం తెలిపారు. ఈ పోటీల్లో జ్యోతిక, సహస్ర, ఈశ్వర్, మనోజ్‌లు గోల్డ్‌మెడల్ సాధించగా, తీర్ధ, శరణ్య, సన్నీజ, శ్రీమయి, మణికంఠ, రామ్, నోహిత్ సిల్వర్ మెడల్స్ సాధించినట్లు ఆమె వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మోహన్‌రావు(ఫైల్)

అనంతగిరి: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. అనంతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతగిరి మండల పరిధిలోని గోండ్రియాల గ్రామానికి చెందిన బండారు మోహన్‌రావు(50) కొంతకాలంగా కోదాడలో కిరాణషాపు నడుపుకుంటూ అక్కడే జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం గోండ్రియాలలో తమ బంధువుల ఇంట్లో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లాడు. సాయంత్రం తన ద్విచక్రవాహనంపై గోండ్రియాలకు చెందిన పేరం పుల్లయ్యతో కలిసి బైక్‌పై కోదాడకు తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యలో తమ్మర బండపాలెం సమీపంలోని బైపాస్ రోడ్డు అండర్‌పాస్ వద్ద ఖమ్మం వైపు నుంచి కోదాడకు వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో మోహన్‌రావుకు తీవ్ర పుల్లయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను తొలుత కోదాడ ఆస్పత్రికి తరలించారు. మోహన్‌రావు పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య బండారు రామాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అనంతగిరి ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పుచ్చ పంట సాగుకు అనువైన సమయం ఇదే..

- తక్కువ ఖర్చు, అధిక దిగుబడి
- హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్

పాడి పంట

నడిగూడెం : వచ్చే వేసవిలో పుచ్చకు బాగా డిమాండ్ ఉంటుంది. పుచ్చలో తక్కువ క్యాలరీలు, ఎక్కువశాతం విటమిన్ ఏ, సీ ఉండటమే కాక దాహాన్ని తీర్చే గుణం కలిగి ఉంటుంది. ఇవి అధిక ఉష్ణోగ్రత గల ప్రాంతాల్లో బాగా పెరుగుతాయి. ప్రస్తుతం ఈ పంట సాగుకు అనుకూలమని హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్ చెబుతున్నారు.

వాతావరణం : వాతావరణంలో ఉష్ణోగ్రతలు 30డిగ్రీల సెంటీగ్రేడ్ లోపు మిక్కిలి అనుకూలం.

నేలలు : లోతైన నేలలు తప్ప ఎర్రటి చెల్క నేలలు, ఇసుక నేలలు, ఒండ్రుమట్టి నేలలు, ఇసుక కలిసిన మిశ్రమ నేలలు అనుకూలం. మురుగు నీరు సౌకర్యం గల నేలలు కూడా అనుకూలం.

విత్తే సమయం : ప్రస్తుత ఫిబ్రవరి నెలాఖరు వరకు అనుకూలం.

రకాలు : ఆశాహి-యమాట, సుగర్ బేబీ, అర్కజ్యోతి, అర్కమానిక్, దుర్గాపూర్ కేసర్ తదితర రకాలు సాగు చేసుకోవచ్చు.

విత్తన మోతాదు : ఒక ఎకరానికి 500 గ్రాములు విత్తనం సరిపోతుంది.

విత్తనశుద్ధి : విత్తనశుద్ధి బీజామృతం లేదా పంచగవ్యతో విత్తన శుద్ధి చేసుకోవాలి. దోసజాతికి చెందిన పంటలను పంచగవ్యతో విత్తన శుద్ధి చేస్తే ప్రభావం అధికంగా చూపిస్తుంది.

కలుపు నివారణ : కలువు మొక్కలను చేతితో పికిలించాలి.

నీటి యాజమాన్యం : పంట వేసిన మొదటి 3-4 వారాలలో క్రమం తప్పకుండా నీటినందించాలి. డ్రిప్ పద్ధతిలో నీరందించడం అత్యుత్తమ పద్ధతి.

పోషకాల యాజమాన్యం : విత్తనశుద్ధి చేసిన తరువాత వరుసల మధ్య 100 సెం.మీ. (3-3.5 అడుగుల) దూరం పాటించి, మొక్కలను వరుసలలో 30-50 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. మొలకెత్తిన వెంటనే నీమాస్త్రం, కంపోస్టు టీ పిచికారీ చేయాలి. తొలి దశలో రసం పీల్చు పురుగులు దాడి అధికంగా ఉంటుంది. కనుక నీమాస్త్రం వాటి నివారణకు ఉపయోగపడుతుంది. కంపోస్టు టీ మొక్కల ఎదుగుదలతో పాటు తెల్లదోమ నివారణకు ఉపయోగపడుతుంది.

తీగ మూరెడు సాగిన తర్వాత కొనను తుంచి వేసి 3 శాతం పంచగవ్య ద్రావణం పిచికారీ చేయాలి. దీని వలన పక్క తీగలు ఎక్కువగా వచ్చి ఆకులు పెద్ద పరిమాణంలో ఏర్పడతాయి. తుంచిన తీగ కొత్త చిగుర్లు వేసిన వెంటనే చేప అమినోయాసిడ్ పిచికారీ చేసుకుంటే పెరుగుదల బాగుంటుంది. పూత దశకు చేరే లోపు అంటే నాటిన నెల రోజుల్లో తులసీ-కలబం కషాయం పిచికారీ చేసుకుంటే మొక్కలు శిలీంద్ర, బ్యాక్టీరియా, వైరస్ తెగుళ్ల బారినుంచి కాపాడటమే కాక, అదనపు పెరుగుదలకు ఉపయోగపడుతుంది. 15 రోజుల వ్యవధిలో జీవామృతం సాళ్ల ద్వారా నీటిలో కలిపి పారించడం లేదా డ్రిప్ ద్వారా పారించడం కొనసాగించాలి. వారం రోజుల వ్యవధిలో పంచగవ్య పిచికారీ చేస్తే నాణ్యమైన దిగుబడి వస్తుంది. అనేక పంటలలో పంచగవ్య పిచికారీ వలన దిగుబడులు రెట్టింపయినట్లు పరిశోధనలు నిరూపించాయి.


సాగులో ఉన్న పుచ్చ


సుందరి సురేష్, హార్టికల్చర్ కన్సల్టెంట్

సాగు విధానం : దుక్కిని మెత్తగా దున్నుకొని బోదెలు ఏర్పాటు చేసుకోవాలి. బోదెల మధ్య సాలు తోలుకుని అందులో ట్రైకోడెర్మావిరిడె, సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్, అజోస్పైరిల్లం, పీయస్‌బీ, పశువుల ఎరువు నాడెపు కంపోస్టు లేదా ఘనజీవామృతం వేసి, సాలుని మూసివేయాలి. ఈ పద్ధతి వలన పుచ్చ పంటలో నాణ్యమైన దిగుబడులు లభించడంతో పాటు తరువాత సాగు చేసే పంటలకు ఉపయోగపడుతుంది.